
హరితహారానికి ఆపదొచ్చింది

- విచ్చలవిడిగా చెట్ల నరికివేత
- విద్యుత్ తీగల అడ్డొస్తున్నాయన్న సాకుతో మొదళ్ల వరకు నరుకుతున్న వైనం
- పట్టించుకోని సంబంధిత అధికారులు 8

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 సిద్దిపేట

శుక్రవారం 30 మే 2025





డ్రిప్పే దిక్కు

తొగుట మండలం, గజ్వేల్ రూరల్ ప్రాంతాల్లో మొక్కజొన్న పత్తి నాటుతున్న రైతులు ఇప్పుడే డ్రిప్పు అమరుస్తున్నారు. ఈ సీజన్‌లో వర్షాలు అధికంగా వస్తాయని చెబుతున్నా.. వానలపైన నమ్మకం పెట్టుకుంటే కష్టమని, ఒకరోజు కురిసి మరుసటి రోజు వానలు పడ వంటున్నారు. వానలపైనే ఆధారపడి సాగు చేస్తే మొలకెత్తిన విత్తనాలు చనిపోతాయని అందుకే డ్రిప్పును ఆశ్రయిస్తున్నట్లు రైతులు తెలిపారు.
(స్టాఫ్ ఫొటోగ్రాఫర్ సిద్దిపేట)



ఆత్మహత్యల నిరోధంపై

ప్రత్యేక శ్రద్ధ

- డివిజన్ పరిధిలో క్రైమ్ రేట్ తగ్గించడానికి కృషి
- రోడ్డు ప్రమాదాల నివారణపై ఫోకస్
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో గజ్వేల్ నూతన ఏసీపీ కోణం నర్సింహులు



గజ్వేల్ ఏసీపీ నర్సింహులు

గజ్వేల్, మే29 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యల నిరోధానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని, క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాల వలన జరిగే నష్టాన్ని ప్రజలకు వివరిస్తానని గజ్వేల్ ఏసీపీ నర్సింహులు అన్నారు. డివిజన్‌లో క్రైమ్‌రేట్ తగ్గించడానికి కృషి చేస్తానంటున్న గజ్వేల్ ఏసీపీ కోణం నర్సింహులుతో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూ

సిద్దిపేట జిల్లాలో గతంలో పనిచేశారా?

మాది ఉమ్మడి మెదక్ జిల్లా పెద్దశంకరంపేట. నాకు ఉమ్మడి మెదక్ జిల్లాపై అవగాహన ఉంది. మహబూబ్‌నగర్ జిల్లాలో ఎస్‌ఐగా, సీఐగా, డీఎస్పీగా 21ఏళ్లు పనిచేశా. వికారాబాద్ డీఎస్పీగా, ఎస్బీ ఇంటెలిజెన్స్ డీఎస్పీగా, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీగా పనిచేశా. 30 ఏళ్ల సర్వీసులో రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలో పనిచేశా.

గజ్వేల్ డివిజన్‌లో ఎలాంటి అంశాలపై దృష్టిసారిస్తారు?

గజ్వేల్ డివిజన్‌లో ఆత్మహత్యలు, రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ముఖ్యంగా క్షణికావేశంలో చేసుకునే ఆత్మహత్యల వల్ల వారి కుటుంబాలకు కలిగే నష్టాన్ని ప్రజలకు వివరిస్తున్నాం. గ్రామీణ స్థాయిలో ప్రజలకు ఆయా రకాలు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తాను. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టి చేపట్టాల్సిన అంశాలపై సీఐలు, ఎస్‌ఐలతో సమన్వయం చేసుకుని పనిచేస్తా. ఎవరూ కూడా మద్యం సేవించి వాహనాలు నడపొద్దు.

శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు?


శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రణాళిక చేపట్టనున్నాం. రాత్రివేళల్లో గస్తీని ముమ్మరం చేస్తాం. గంజాయి, ఇతర మత్తు పదార్థాల జోలికి ప్రజలు వెళ్లకుండా అవగాహన కార్యక్రమాలు చేపడుతాం. సీపీ ఆదేశాలతో హోంగార్డు నుంచి ఇన్‌స్పెక్టర్ వరకు అంతా సమన్వయంతో పనిచేసి గ్రామీణ ప్రాంతాల్లో వీపీవో వ్యవస్థను బలోపేతం చేస్తాం. గజ్వేల్ డివిజన్‌ను క్రైమ్ ఫ్రీగా మార్చే ప్రయత్నాలు చేస్తా.

మేమూ ఉన్నాం

వారంలో కాంగ్రెస్ కొత్త కమిటీలు

- పదవుల కోసం ఉమ్మడి జిల్లా నేతల ప్రయత్నాలు
- టీపీసీసీ కార్యవర్గంలో చోటుపై ఆశలు
- పలువురికి రేవంత్, మహేశ్‌గౌడ్ ఆశీస్సులు
- పార్టీలో కీలక స్థానాలు దక్కే అవకాశం
- సీనియర్ల పేర్లను పరిశీలిస్తున్న అధిష్ఠానం

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి వారం రోజుల్లోనే నూతన కార్యవర్గాన్ని ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. ఆశావహుల పేర్లను వడగట్టి ఇప్పటికే ఒక జాబితా రూపొందించారు. అయితే అధిష్ఠానం సూచనల మేరకు మార్పులు చేర్పులు చేస్తున్నారు. కొత్త కమిటీపై ఢిల్లీలో తుది కసరత్తు చేస్తున్న నేపథ్యంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన నేతలు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్ర కార్యవర్గంలో తమ పేర్లనూ పరిశీలించాలని ఇటు ప్రభుత్వ పెద్దలు, అటు పార్టీలోని ముఖ్యులతో మొరపెట్టుకుంటున్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రభావిత ప్రాంతంగా భావించి మెతుకుసీమలోని కాంగ్రెస్ సీనియర్లకు పదవులు ఇచ్చేందుకు అధిష్ఠానం సైతం సుముఖంగానే ఉన్నట్లు తెలిసింది.



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మే 29: సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో పునర్వైభవం కోసం కాంగ్రెస్ ప్రయత్నాలు ప్రారంభించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో హుస్నాబాద్ సహా 11 నియోజకవర్గాల్లో.. 4 స్థానాలను మాత్రమే దక్కించుకుంది. సిద్దిపేట జిల్లాలో హుస్నాబాద్, మెదక్, సంగారెడ్డి జిల్లాలో అందోల్, నారాయణఖేడ్‌లో పార్టీ విజయం సాధించింది. పార్లమెంటు ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు మిశ్రమ ఫలితమే దక్కింది. ఈ క్రమంలో పార్టీని బలోపేతం చేసేందుకు అధిష్ఠానం పావులు కదుపుతున్నది. ఈమేరకు త్వరలో ఏర్పాటు చేయనున్న టీపీసీసీ కార్యవర్గంలో ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యం దక్కవచ్చని భావిస్తున్నారు.

ఆశావహుల ప్రదక్షిణలు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో కార్పొరేషన్, నామినేటెడ్ పదవులు దక్కని ఆశావహులు పార్టీ పదవులను ఆశిస్తున్నారు. ముఖ్యమంత్రి, మంత్రులతోపాటు టీపీసీసీ ముఖ్యుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గత పదేళ్ల పార్టీ కోసం శ్రమించామని, ఇప్పుడైనా తమ సేవలను గుర్తించాలని విన్నవిస్తున్నారు. అయితే, టీపీసీసీ కొత్త కార్యవర్గంలో కేవలం సీనియర్లకే ప్రాధాన్యం ఇవ్వాలని అధిష్ఠానం యోచిస్తున్నట్లు తెలుస్తున్నది. ఉమ్మడి జిల్లా నుంచి కనీసం ఆరుగురికి జాబితాలో చోటు దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు ఎవరినీ వరించలేదు. కనీసం పార్టీ పదవులైనా ఇవ్వాలని ఈ జిల్లాల నేతలు అడుగుతున్నారు.

కౌంటర్లు విసిరే నేతలకే అవకాశం

ఓవైపు కాంగ్రెస్‌పై ప్రజల్లో సానుకూల ప్రచారం చేస్తూనే మరోవైపు బీఆర్ఎస్, బీజేపీ నేతల నుంచి వచ్చే విమర్శలను తిప్పికొట్టేవారికే పార్టీ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిసింది. గతంలో ఉమ్మడి జిల్లా నుంచి

మిగతా 6వ పేజీలో



హుస్నాబాద్‌లో గూగి వా థియోంగో గుర్తులు

- 1996లో హుస్నాబాద్‌లోని అమరవీరుల స్థూపం సందర్శన
- గుర్తుచేసుకున్న సాహితీవేత్తలు, కవులు

హుస్నాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి) : కెన్యా అంతర్జాతీయ రచయిత గూగి వా థియోంగో గతంలో హుస్నాబాద్‌లో పర్యటించారు. 1996లో భారత సందర్శనలో భాగంగా హైదరాబాద్‌లో జరిగిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. అనంతరం తన సతీమణితో కలిసి రాష్ట్రంలోని ఉద్యమ ప్రాంతాలను సందర్శించారు. ఈ క్రమంలో హుస్నాబాద్‌లోని ఆసియా ఖండంలోనే రెండో అతిపెద్ద అమరవీరుల స్థూపాన్ని సందర్శించి నివాళులర్పించారు. నాడు ఆయన వెంట చిక్కుడు ప్రభాకర్, పీవీ కొండాల్, చలసాని ప్రసాద్ ఉన్నారు. గురువారం ఆయన మృతితో ఈ విషయాన్ని ఇక్కడి సాహితీవేత్తలు, రచయితలు, ప్రజాసంఘాల నాయకులు గుర్తు చేసుకున్నారు.

మట్టి మేలు

తలపెట్టవోయ్

- భూసార పరీక్షలతో పంటలకు రక్ష
- ఫలితాల ఆధారంగా పంటల సాగు, ఎరువుల వినియోగం చేపట్టాలి
- దిగుబడి నష్టాలను తగ్గించుకునే అవకాశం 7

సర్కారు బడి..

నూతన ఒరవడి

- ప్రైవేటుకు దీటుగా నడుస్తున్న జడ్పీహెచ్ఎస్‌లు
- వసతుల్లో పర్ఫెక్ట్.. బోధనలో బెస్ట్.. క్రీడల్లో ఫస్ట్
- పీఎంశ్రీకి కుకునూరుపల్లి స్కూల్
- ప్రత్యేకత చాటుతున్న చిన్నకిష్టాపూర్ పాఠశాల 7



సంప్రదాయ

కళా వైభవం

- ఐఐటీహెచ్‌లో మైమరపింపజేసిన సంగీత కచేరీ, జానపద నృత్య ప్రదర్శనలు 7



ఆర్ద్ర మహోత్సవం

కొండపాక మండలం మర్పడగ విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున క్షేత్రంలో క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథ శర్మ పర్యవేక్షణలో గురువారం ఆర్ద్ర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

కొండపాక, మే 29

నకిలీ ఎరువులు, విత్తనాలను అరికట్టాలి

- కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, మే 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నకిలీ విత్తనాలు, ఎరువులు సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. గురువారం ఐడీవోసీలోని సమావేశ మందిరంలో కలెక్టర్ వ్యవసాయ, పోలీస్‌శాఖల సంబంధిత శాఖల అధికారులతో టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో రుతుపవనాలు ముందస్తుగా రావడంతో రైతులు పొలాల సాగుపై దృష్టి సారించడంతో దళారులు, వ్యాపారులు వారికి ఆశ చూపి నకిలీ విత్తనాలు, ఎరువులు అంటగట్టే ప్రయత్నం చేస్తారని, టాస్క్‌ఫోర్స్ కమిటీ పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. మండలస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంతో పాటు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలన్నారు. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేసేలా రైతు వేదికల్లో అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలోకి బయటి నుంచి విత్తనాలు, ఎరువులు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు గరీమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాధిక, ఏడీఏలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

కిసాన్ మేళాను విజయవంతం చేయాలి

జూన్ 4 నుంచి 6 వరకు హుస్నాబాద్‌లో జరగనున్న కిసాన్ మేళా కార్యక్రమానికి అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. హుస్నాబాద్ మార్కెట్ కమిటీలో నిర్వహించనున్న కిసాన్‌మేళాలో దాదాపుగా 130 స్టాల్స్ వరకు ఏర్పాటు చేయనున్నందున ప్రతి విభాగాన్ని పర్యవేక్షిస్తూ రైతులకు అవగాహన కల్పించడంతో పాటు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

గౌరవెల్లి ప్రాజెక్టు

పూర్తి చేయాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

అక్కన్నపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం అక్కన్నపేట మండలం గౌరవెల్లి ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మెట్టప్రాంతమైన హుస్నాబాద్ నియోజకవర్గానికి సాగునీరు కోసం రైతుల పక్షాన సీపీఐ చేసిన పోరాటాల వల్లే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవెల్లి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిందన్నారు. ప్రాజెక్టు పనులు ప్రారంభించి 17 ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు పూర్తి కాలేదని, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మిగిలిన పనులను పూర్తి చేయాలన్నారు. ప్రజా సంక్షేమం కోసం సీపీఐ పార్టీ అనేక పోరాటాలు నిర్వహిస్తుందని, పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని గెలిపించాలని కోరారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం అధికారులను, ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు. ఇందులో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జాగీరు సత్యనారాయణ, యెడల వనేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు జేరిపోతుల జనార్దన్ ఉన్నారు

కార్యదర్శుల కిరికిరి!

- కొత్త డీఎస్ఆర్ యాప్ వద్దంటూ నిరసన
- ఐదురోజులుగా జీరో అటెండెన్స్

దుబ్బాక, మే29 (ఆంధ్రజ్యోతి) : "అసలే నిధులు రావడం లేదు. అప్పులు చేసి గ్రామాల్లో పనులు చేస్తున్నాం. ఈ భారం సరిపోదన్నట్లు మాకెందుకు కొత్త మార్గదర్శకాల భారమంటూ' జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు ఐదురోజులుగా ప్రభుత్వ కార్యక్రమాలకు సహాయ నిరాకరణ ఉద్యమాన్ని చేపట్టారు.

జిల్లాలోని 508 మంది పంచాయతీ కార్యదర్శులు ఈ నెల 24 నుంచి జీరో అటెండెన్స్, కొత్తయాప్‌లో శానిటేషన్ రిపోర్టును నమోదు చేయడం లేదు ఇప్పటికే నిర్వహణ భారం, పనిభారం ఉండగా తమకు మరింత భారం మోపే యాప్‌తో తాము పనిచేయలేమంటూ చేతులెత్తేస్తున్నారు. ఐదురోజులుగా పంచాయతీ కార్యదర్శులు నిరసనను వ్యక్తం చేస్తూ అటెండెన్స్, డీఎస్ఆర్ అప్‌లోడ్ చేయడంలేదు. జిల్లా అధికారు లు ఒత్తిడి తెచ్చినా ససేమిరా అంటూ సహాయ నిరాకరణ చేపట్టారు. అయితే జీరో అటెండెన్స్‌ను సెలవులుగా పరిగణించి జీతంలో కోత విధిస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

కొత్త మార్గదర్శకాల్లో అసలు భారమెంత?

గ్రామపంచాయతీలో ఉన్న మొత్తం గృహాల సంఖ్యను పొందుపరిచి రోజువారీగా ఎన్ని గృహాల నుంచి చెత్త సేకరించారో యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇదంతా స్వయంగా పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షణలో జరగాలి. గృహాల సముదాయంలో తడిచెత్త, పొడిచెత్త ఎంత పరిమాణంలో (కిలోల చొప్పున) సేకరించారో అందులో పొందుపరచాలి. మొత్తం ఇళ్ల నుంచి ఎంత పరిమాణంలో సేకరించారో పూర్తి వివరాలు నమోదు చేయాలి. డంపింగ్‌షెడ్, శ్మశాన వాటిక, పల్లెప్రకృతివనం, నర్సరీ, మొదలగు వాటి వద్ద అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇదే సమయంలో ప్రభుత్వ కార్యక్రమాలు ఉండడంతో కార్యదర్శి సకాలంలో వెళ్లకపోతే సమస్య తలెత్తే అవకాశం ఉంది. గ్రామానికి ప్రత్యేకాధికారి ఉండే తమను చెత్తసేకరణలో తిరమనడం సరికాదని, ఫలితంగా రోజువారీ పనులు పడకేస్తాయని ఆవేదన చెందుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఇంటర్‌నెట్ సరిగా లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఒక్కోసారి రెండు గంటల వరకు సమయం వృథా అవుతుందని వాపోతున్నారు. రెవెన్యూ అధికారులు చేయాల్సిన ఓటరు లిస్టు సర్వే, ఫుడ్ సెక్యూరిటీ కార్డు సర్వేలు పంచాయతీకార్యదర్శులు చేస్తున్నారు. గృహ నిర్మాణశాఖ చేయాల్సిన ఇందిరమ్మ ఇళ్లు, ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్‌భగీరథ సర్వే కూడా వీరే చేస్తున్నారు. డీఆర్‌డీఏ అధికారులు చేయాల్సిన స్వచ్ఛభారత్ మిషన్‌తో పాటు పలు కార్యక్రమాలను కార్యదర్శులకే అప్పగించారు. ఏ ప్రభుత్వ అధికారికి లేని విధంగా సుమారు పది యాప్‌లలో వివరాలు అప్‌లోడ్ చేసే బాధ్యతలు కార్యదర్శులకు ఉండడం గమనార్హం. ఈ క్రమంలో తమ సమస్యలను పరిష్కరించేవరకు తాము ఆందోళన విరమించబోమని పంచాయతీ కార్యదర్శులు తేల్చిచెబుతున్నారు.



పద్మశాలి గడ్డ గ్రామపంచాయతీ భవనం

బైక్ ఢీకొని యువకుడి మృతి



పటాన్‌చెరు రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధి లోని నాగులపల్లి ఓఆర్ఆర్ వద్ద చోటుచేసుకుంది. సీఐ స్వామి గౌడ్ కథనం ప్రకారం గుంటూరు జిల్లా అమరావతి మండలానికి చెందిన చల్లంచెర్ల ప్రభుదాస్(33) నాగులపల్లిలో నివాసముంటూ తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. గురువారం పని ముగించుకుని పల్సర్ బైక్‌పై వస్తుండగా ఓఆర్ఆర్ ఎగ్జిట్-2 100 ఫీట్ల రోడ్డు వద్ద ఎదురుగా రాంగ్ రూట్లో ఓవర్ స్పీడ్‌లో వస్తున్న స్పెండర్ బైక్ ఢీకొనడంతో ప్రభుదాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తూప్రాన్‌లో ఆవుల పట్టివేత

తూప్రాన్, మే 29 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలో అక్రమంగా తరలిస్తున్న గోవులను గురువారం రాత్రి పట్టుకున్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ నుంచి లారీ సుమారు 40 పశువులను తరలిస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు తూప్రాన్ పట్టణ పరిధి పోతరాజుపల్లి వద్ద బీజేపీ నాయకులు కాపు కాసి లారీని పట్టుకున్నారు. లారీలో సుమారు 12 ఆవులు ఉండగా, మిగతావి ఎద్దులు, గేదెలు, లేగదూడలు ఉన్నాయి. పట్టుబడిన లారీని పోలీసులకు అప్పగించగా, పశువులను మాసాయిపేట మండలంలోని రామంతాపూర్ శివారులోని గోశాలకు తరలించారు.

చాలాన్లు..!

ఎడాపెడా బాదుడుతో వాహనదారుల బెంబేలు

- ట్రాఫిక్ నియంత్రణ మరిచి కెమెరాలను తెరిచి..
- ప్రభుత్వ ఖజానా నింపేందుకు పోలీసులు పోటీ
- మద్యం షాప్ పక్కనే డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలా?
- వాహనదారులకు ఏటా రూ.కోట్లల్లో జరిమానాలు

సంగారెడ్డి క్రైం, మే 29 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో వాహనచోదకులపై పోలీసులు ప్రతాపం చూపిస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు ఉల్లంఘన పేరుతో వాహనదారులపై జరిమానాల రూపంలో విరుచుకుపడుతున్నారు. వాహనాలు నడిపే సమయంలో వాహనదారులు వాహనానికి సంబంధించిన అన్ని ధృవపత్రాలు దగ్గర ఉంచుకోవడంతో పాటు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని పోలీసులు వివిధ సందర్భాల్లో సూచిస్తున్నారు. కానీ జిల్లాలో ద్విచక్ర చాలావరకు వాహనచోదకులు హెల్మెట్ లేకుండానే వాహనాలను నడుపుతున్నారు. ఈ తరుణంలో రాష్ డ్రైవింగ్ చేస్తూ కిందపడిపోవడమో, ఇతరులకు ఢీకొట్టడమో జరిగి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు తలకు గాయం కాకుండా హెల్మెట్ ఉపయోగపడుతుందని పోలీసులు చెబుతున్నా వాహనచోదకులు పట్టించుకోవడం లేదు. దీంతో పోలీసులు ఉల్లంఘనులపై భారీగా జరిమానాలతో బాదేస్తున్నారు.

రూ.కోట్లల్లో జరిమానాలు

జిల్లాలోని పలు ప్రధాన కూడళ్లల్లో పోలీసులు వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఏటా కోట్ల రూపాయల జరిమానాలు విధిస్తున్నారు. ప్రభుత్వ ఖాజానాను నింపేందుకు పోలీసులు పోటీ పడుతున్నారు. ప్రతి సంవత్సరం కోట్లల్లో జరిమానాలు విధించడంతోపాటు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనకు సంబంధించి గత మూడు సంవత్సరాల్లో సంగారెడ్డి జిల్లాల్లో కోట్లలో జరిమానాలు విధించారు.



సంగారెడ్డి పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు (ఫైల్)

డ్రంకెన్ డ్రైవ్ కేసులు, జరిమానాలు

సంవత్సరం	కేసులు	జరిమానాలు
2022	6369	69,42,795
2023	11404	1,15,55,200
2024	8676	1,13,50,293

మద్యం దుకాణాల పక్కనే..

మద్యం సేవించి వాహనం నడపడం నేరం అయినప్పటికీ పోలీసులు మాత్రం అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకోవాలే తప్ప మద్యం షాక్ పక్కనే డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించడం ఎంతవరకు సమాంజసమని ప్రశ్నిస్తున్నారు. మద్యం దుకాణానికి కొద్ది దూరంలోనే డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి వేలల్లో జరిమానాలు వేస్తున్నారని వాహనచోదకులు వాపోతున్నారు. ఇలా గత మూడు సంవత్సరాల్లో పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల ద్వారా పెద్ద ఎత్తున కేసులు నమోదు చేయడం, జరిమానాలు విధించడంతోపాటు పలువురిని జైలుకు పంపారు.

ట్రాఫిక్ నియంత్రణ విస్మరించి..

జిల్లాలోని వివిధ ప్రధాన కూడళ్ల వద్ద పోలీసులు ట్రాఫిక్ నియంత్రించాల్సి ఉండగా చేతిలో కెమెరాలు పట్టుకొని వాటికి పని చెబుతున్నారు. వాహనంపై ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణం, సిగ్నల్ జంపింగ్, రాంగ్ రూట్లల్లో వెళ్లడం, అతివేగంగా వెళ్తున్న వారిని గుర్తించి వారి ఫొటోలను కెమెరాల్లో బంధిస్తున్నారు. అనంతరం ఆన్‌లైన్ ద్వారా చాలాన్ల రూపంలో వాహనచోదకులకు పంపుతున్నారు. ఒక వాహనంపై భార్యాభర్త, కొడుకు కలిసి వెళ్లడం కొన్ని సార్లు అనివార్యమవుతోందని, ఆ సందర్భంలో కూడా పోలీసులు ఆన్‌లైన్ ద్వారా చలాన్లు వేస్తున్నారని వాపోతున్నారు.

ట్రాఫిక్ ఉల్లంఘనల జరిమానాలు ఇలా..

సంవత్సరం	కేసులు	జరిమానాలు
2022	2,89,244	12,11,68,987
2023	2,44,593	9,59,53,273
2024	1,94,888	7,78,47,962

రేసులో మేమూ ఉన్నాం

(5వ పేజీ తరువాయి)

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జగ్గారెడ్డిని ఎంపిక చేశారు. పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు, అధికారంలోకి వచ్చాక తనదైన పాత్రను పోషిస్తున్నారు. అధిష్టాన పెద్దలను, ప్రభుత్వాన్ని ఎవరైనా విమర్శలు చేస్తే వెంటనే స్పందిస్తారనే పేరుంది. దీంతో నూతన కమిటీలో ఆయనకు కీలక స్థానం దక్కవచ్చనే ప్రచారం జరుగుతోంది. అదే విధంగా జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు, పోటీచేసి ఓడిపోయిన నేతలు, ఇతర నాయకుల పేర్లను పరిశీలిస్తున్నారు. పదవులు ఆశిస్తున్నవారిపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నట్లుగా తెలిసింది. గత పదేళ్లలో వారు అనుసరించిన అంశాలను సైతం పరిగణనలోకి తీసుకుంటున్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లను ఎదుర్కోవడం, కాంగ్రెస్‌ను బలోపేతం చేసిన విషయాలపైనా ఆరా తీస్తున్నారు.

అధిష్టానం ఆరా

ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆశీస్సులు ఉన్నవారికే పదవులు దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆశావహుల గత నేపథ్యంతో పాటు భవిష్యత్‌లో పార్టీకి ఉపయోగపడేవారికే ప్రాధాన్యత ఇవ్వనున్నారు. త్వరలోనే స్థానిక, గ్రామపంచాయతీ ఎన్నికలు జరుగుతాయనే సంకేతాలు ఉన్నాయి. మున్సిపల్ ఎన్నికలను సైతం నిర్వహించాల్సి ఉంది. దీంతో ఎన్నికల్లోనూ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం చేసే సత్తా ఉన్నవారినే ఎంపిక చేయనున్నారనే సమాచారం. మళ్లీ వచ్చే అసెంబ్లీ ఎన్నికల వరకూ ఇదే కార్యవర్గం కొనసాగే అవకాశాలు ఉన్నాయి. అప్పటికి కూడా పార్టీని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లేవారిపైనే అధిష్టానం దృష్టి సారించినట్లుగా తెలుస్తోంది. ఇలాంటి వారికే ప్రభుత్వ పెద్దలు, పార్టీ ముఖ్యుల ఆశీస్సులు దక్కనున్నాయి. మరో వారం రోజుల్లోపలే కొత్త కార్యవర్గం ప్రకటిస్తున్నందున ఆశావహులు అటు ఢిల్లీ, ఇటు హైదరాబాద్‌లో మకాం వేసినట్లుగా తెలుస్తున్నది.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సదాశివపేట, మే 29: (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన గురువారం సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం గొల్లగూడెం గ్రామ శివారులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గురువారం మధ్యాహ్నం 3గంటల సమయంలో గ్రామ సమీపంలో 65వ నంబర్ జాతీయ రహదారి పక్కన నిర్మాణంలో ఉన్న ఓ భారీ కాలువలో 40 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి మృతదేహాన్ని గ్రామస్థులు గుర్తించారు. వారిచ్చిన సమాచారం మేరకు అక్కడి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు బూడిద రంగు ప్యాంటు, నీలం రంగు గీతల షర్టు ధరించి ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

- ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన



అన్నపూర్ణ మృతదేహం

సదాశివపేట, మే 29: (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ మహిళ మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. మునిపల్లి మండలం ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన అన్నపూర్ణ(45) సదాశివపేట పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే అన్నపూర్ణ మృతి చెందిందని ఆమె బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రి వద్దకు చేరుకోవడంతో ఆందోళన సద్దుమణిగింది. మృతురాలి కుటంబానికి ఆసుపత్రి వర్గాలు నష్టపరిహారం ఇచ్చేందుకు అంగీకరించినట్టు తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

మహిళ ఇంట్లోకి చొరబడిన వ్యక్తి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ ఆసిఫ్

నంగునూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): మహిళ ఇంట్లో చొరబడిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. రాజగోపాలపేట ఎస్ఐ మహ్మద్ ఆసిఫ్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత తన తల్లిగారింటి వద్ద ఉంటున్నది. పాలమాకుల గ్రామానికి చెందిన రేషన్ డీలర్ సంపంగి మహేశ్ తనకు పరిచయం ఉన్న ఆ మహిళ ఇంటివద్ద మంగళవారం రాత్రి తన స్నేహితుడు పల్లెపు సంపత్‌ను బయట కాపలా ఉంచి ఇంట్లోకి చొరబడ్డాడు. దీంతో మేల్కొన్న సదరు మహిళ కేకలు వేయగా, ఆమె తల్లిదండ్రులు, చుట్టుపక్కల వారు మేల్కొనడంతో నిందితులు బైక్‌పై పారిపోయారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని బుధవారం బస్టాండ్ వద్ద ఇరువురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉజ్జయిని మహంకాళి ఆలయంలో చోరీ

తూప్రాన్, మే 29 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలోని పురాతనమైన ఉజ్జయిని మహంకాళీ ఆలయంలో బుధవారం రాత్రి చోరీ చోటుచేసుకున్నది. పట్టణంలోని పోతరాజుపల్లిలోని నాలుగిళ్లలో చోరీ జరిగిన మరునటి రోజే ఈ ఆలయంలో చోరీ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం రాత్రి ఆ ఆలయ ప్రధాన ద్వారం తాళాలు పగులగొట్టి ఆలయంలోకి ప్రవేశించిన దుండగులు రెండు హుండీల తాళాలు ధ్వంసం చేసి నగదు తస్కరించారు. అమ్మవారి గర్భగుడి ద్వారం తాళాలు పగలగొట్టేందుకు ప్రయత్నించి విరమించుకున్నట్లు అనుమానిస్తున్నారు. గురువారం ఉదయం ఆలయానికి చేరుకున్న పూజారి చోరీ విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య



గణేష్ (ఫైల్)

రామాయంపేట, మే 29 (ఆంధ్రజ్యోతి) : యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని దామరచెరువు గ్రామంలో చోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గణేష్ (25) కొన్ని రోజులుగా హైదరాబాదులో ఉంటూ నాలుగు రోజుల క్రితమే స్వగ్రామానికి వచ్చాడు. గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గణేష్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

మరో ఘటనలో..



శివకుమార్ మృతదేహం

సదాశివపేట, మే 29: (ఆంధ్రజ్యోతి) : యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సదాశివపేట పట్టణంలోని గురునగర్ కాలనీలో చోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. మునిపల్లి మండలం కల్లపల్లి బేలూరు గ్రామానికి చెందిన శివకుమార్(26) గురునగర్‌కాలనీలో నివాసముంటున్నాడు. గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. శివకుమార్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

అదుపుతప్పి ధాన్యం లారీ బోల్తా

నిజాంపేట, మే 29(ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి లారీ బోల్తా పడిన సంఘటన నిజాంపేట మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మండల కేంద్రంలోని రైతు వేదిక సమీపంలో గురువారం రామాయంపేట నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న వడ్ల లారీ డ్రైవర్ అదుపుతప్పి బోల్తా పడింది. అందులో ఉన్న డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకున్నారు.



'గీతం'లో ఏఐ-ఎంఎల్ వర్క్‌షాప్

ఇంజనీరింగ్ అధ్యాపకులకు అవగాహన

పటాన్‌చెరు రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని కోర్ ఇంజనీరింగ్(ఏరోస్పేస్, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్) అధ్యాపకులకు ఏఐ-ఎంఎల్ లను పరిచయం చేయడంతో పాటు, వాటిపై పూర్తి అవగాహన కల్పించేందుకు రెండు రోజులపాటు నిర్వహించనున్న వర్క్‌షాప్‌ను గురువారం ప్రారంభించారు. స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్, కోర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ వీఆర్ శాస్త్రి ప్రారంభించి, ఈ సదవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వర్క్‌షాప్‌ను ప్రొఫెసర్ ప్రీతి పర్వేకర్, డాక్టర్ వి.శిరీష, డాక్టర్ చంద్రశేఖర్ సమన్వయం చేస్తున్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

- జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ దేశబోయిని నర్సింహులు



హ్యాండ్‌బాల్ శిబిరంలోని విద్యార్థులతో దేశబోయిని నర్సింహులు

గజ్వేల్ రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలని జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు, జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ దేశబోయిని నర్సింహులు సూచించారు. కొడకండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా యువజన సంక్షేమ క్రీడల శాఖ సహకారంతో వ్యాయామ ఉపాధ్యాయురాలు విశాల ఆధ్వర్యంలో హ్యాండ్‌బాల్‌లో నిర్వహిస్తున్న ఉచిత వేసవి క్రీడా శిబిరాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు మానసికోల్లాసం, శారీరక ఎదుగుదల ఎంతో అవసరమని, ప్రస్తుత సమాజంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కోవడానికి ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని, క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ గెలుపోటములను పట్టించుకోకుండా క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడల్లో ముందుకు సాగాలంటే సాధననే ముఖ్యమని తెలిపారు. తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని సూచించారు. బాలల గొప్ప ఆశయం ఏర్పరచుకొని సాధన దిశలో ప్రయాణించాలని చెడు అలవాట్లకు లోనుకావద్దని చిన్న విషయాలకు కృంగిపోయి ఆత్మహత్యలకు పాల్పడవద్దన్నారు. హ్యాండ్‌బాల్ వేసవి శిబిరంలో మెలకువలు నేర్చుకొని పరిణితి సాధించి జిల్లా, రాష్ట్ర స్థాయి జాతీయ స్థాయిలో మంచి పేరు తేవాలన్నారు.


అక్కన్నపేట మండలం కుందనవానిపల్లిలో రైతు పొలంలో మట్టి నమూనాలను సేకరిస్తున్న ఏఈవో శ్రీలత

పంట దిగుబడి పెరగాలంటే సారవంతమైన భూమి అవసరం. పంటకు కావలసిన పోషకాలు కొంత మోతాదులో మట్టిలోనే సహజంగానే ఉంటాయి. నేలలో లవణాల రూపంలో కరిగి ఉన్న ఈ పోషకాలు మొక్క ఎదుగుదలకు అవసరమవుతుంది. అందుకే ఏ భూమిలో పోషకాలస్థాయి ఏ మేరకు ఉందో తెలుసుకోవాలంటే రైతులు ప్రతీ రెండేళ్లకు పొలంలో మట్టి పరీక్షలను తప్పకుండా చేయించుకోవాలి.

- అక్కన్నపేట, మే 29 (ఆంధ్రజ్యోతి)

మట్టి మేలు తలపెట్టవోయ్

భూసార పరీక్షలతో పంటలకు రక్ష

ఫలితాల ఆధారంగా పంటల సాగు, ఎరువుల వినియోగం చేపట్టాలి

దిగుబడి నష్టాలను తగ్గించుకునే అవకాశం

మట్టి నమూనా అనేది మొత్తం పొలాన్ని యూనిట్‌గా తీసుకుంటారు. పొలం ఖాళీగా ఉండే సమయంలో ఎప్పుడైనా మట్టి నమూనా తీసుకోవచ్చు. సాధారణంగా ఒక పంట పండించే భూమిలో ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ నెల మధ్యలో, రెండు పంటలు పండించే చోట్ల మే నెలలో మట్టి నమూనాలు సేకరించుకోవాలి. పొలమంతా ఒకేరకంగా ఉంటే ఐదు ఎకరాల విస్తీర్ణానికి ఒక నమూనా చొప్పున తీసుకోవాలి. అదే భూమి రకంలో వ్యత్యాసం ఉంటే వేర్వేరుగా నమూనాలు తీసుకోవాల్సి ఉంటుంది.

నమూనా సేకరణ ఇలా..

పొలంలో 10 నుంచి 12 చోట్ల మట్టి నమూనా తీసుకోవాలి. ముందుగా నేలపైన చెత్తచెదారం తీసివేసి వి ఆకారంలో 6 అంగుళాల లోతులో గుంత తీసుకోవాలి. తరువాత పైనుంచి కిందకు ఒక పలుచని మట్టి పొర వచ్చే విధంగా పారతో మట్టిని తీసుకోవాలి. ఈ రకంగా 10, 12 చోట్ల నుంచి సేకరించిన మట్టిని ఒక ప్లాస్టిక్ కవర్‌లో లేదా గోనెసంచి, ప్లాస్టిక్ బకెట్‌లో వేసుకోవాలి. తరువాత ఈ మట్టిని చతురస్రాకారంలో నేలమీద గానీ లేదా గోనె పట్టాపైన గాని పరుచుకోవాలి. మొత్తం మట్టిని సమ భాగాలుగా వచ్చేలా అడ్డంగా నిలువుగా గీతలు గీయాలి. ఎదురెదురుగా ఉన్న భాగాలను తీసివేయాలి. ఇలా చేసిన తరువాత రెండు భాగాలు మిగులుతాయి. ఈ రెండు భాగాలను కలిపేసి మళ్లీ నాలుగు సమ భాగాలుగా చేసుకోవాలి. ఈసారి ఎదురెదురుగా ఉన్న రెండు భాగాలను తీసివేసి, మిగిలిన రెండు భాగాలను కలుపుకోవాలి. ఈ విధంగా మనకు ఒక అరకిలో మట్టి వచ్చేవరకు చేసుకుంటే మొత్తం పొలాన్నంతా ప్రతిబింబించే మట్టి నమూనా సేకరించే అవకాశం ఉంటుంది. భూపరీక్ష ఫలితాలు కూడా సరిగా వచ్చేందుకు దోహదం చేస్తుంది. సేకరించుకున్న మట్టిని పాలిథిన్ సంచిలో వేసి, దానిపైన రైతు పేరు, గ్రామం, మండలం, సర్వే నంబరు, పొలం విస్తీర్ణం, మూడు కాలాలుగా పండించిన పంటల వివరాలు, తరువాత వేయబోయే పంటల వివరాలు, సాగు నీటి వివరాలు, నమూనా సేకరించిన తేదీ సమాచారం అంతా రాసి భూసార పరీక్షా కేంద్రానికి పంపించాలి.

> **రెండేళ్లకోసారి చేయించుకోవాలి**
>
> రైతులు మట్టి పరీక్షల ఫలితాలను బట్టి పంటలు సాగు చేసుకోవాలి. రెండేళ్లకోసారి మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించుకోవాలి. మట్టి పరీక్ష ఫలితాలు వచ్చిన తర్వాత ఏ పంటలు వేసుకోవాలి, దిగుబడి కోసం ఎలాంటి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలో తెలుస్తుంది. వ్యవసాయ అధికారుల సూచనలు మేరకు ఎరువులు వాడాలి.
>
> **- కరంటోతు శ్రీలత, మండల వ్యవసాయ విస్తరణ అధికారి, రామవరం**

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

చెట్ల కింద, గట్ల పక్కన, కంచెల దగ్గర, కాలిబాటలలో మట్టి నమూనా తీయకూడదు. పశువుల ఎరువు కుప్పల దగ్గర, పిట్ల కంపోస్ట్ పడే దగ్గర నమూనా సేకరించవద్దు సారవంతంగా ఉన్న భూమిలోనూ, బాగా నిస్సారంగా ఉన్నచోట్ల కలిపి మట్టి నమూనా తీయకూడదు. చౌడు భూములోనూ, సారవంత భూమిలోనూ కలిపి నమూనా తీయకూడదు. గుంతలు తీసేటప్పుడు పైన ఉన్న చెత్త చెదారం తీసివేయాలే గానీ పైన ఉన్న మట్టి పొర తొలగించకూడదు. బురద నేలలో సేకరించవద్దు. చౌడు ఎక్కువగా ఉన్న నేలల్లో పైనుంచి 15 సెంటీమీటర్ల వరకు ఒక నమూనా, 15 నుంచి 30 సెంటీమీటర్ల వరకు మరో నమూనా తీసుకోవాలి.

పోషకాల స్థాయిని బట్టి ఎరువులు

నేలలో ఉన్న నత్రజని, భాస్వరం, పొటాష్ మూలకాల పరిమాణం ఎంత ఉందనే విషయం తెలుసుకోవచ్చు. ఒకవేళ పోషకాలు తక్కువగా ఉంటే సిఫారసు చేసిన ఎరువుల పరిమాణంలో 25శాతం పెంచి వేసుకోవాలి, ఎక్కువగా ఉంటే 25శాతం తగ్గించి వేసుకోవాల్సి ఉంటుంది. ఇక సేంద్రియ కర్బనం పరిమాణాన్ని బట్టి ఎంత మోతాదులో ఎరువులు వేసుకోవాలి అనే విషయం భూపరీక్షతో తెలుసుకోవచ్చు. దీంతో పాటుగా జింక్, ఇనుము, మెగ్నీషియం, బోరాన్ వంటి సూక్ష్మపోషక లోపాల గురించి తెలుసుకొని దానికి అనుగుణంగా నివారణ చర్యలు చేపట్టే అవకాశం ఉంటుంది.


చిన్నకోడూరు మండలం శంకరాయకుంటలో సాగు చేసిన జీలుగు

పచ్చిరొట్ట సాగు.. భూసారం బాగు

చిన్నకోడూరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన పంటల సాగుకు ముందు పచ్చిరొట్ట పంటను సాగుచేసి పూత దశకు రాగానే కలియదున్నితే భూసారం పెరిగి నేల ఆరోగ్యంగా ఉంటుంది. పంటలకు మేలు చేసే సూక్ష్మజీవుల మోతాదు పెరుగుతుంది. దీంతో తర్వాత వేసే పంటలకు పోషకాలు లభ్యత బాగుంటుంది. సాధారణంగా పచ్చిరొట్ట విత్తనాలను 40 రోజుల ముందే సాగుచేయాలి. ఉమ్మడి జిల్లాలో ముందస్తు నాట్లు ఎక్కువగా వేయరు. జూన్ తర్వాతే నాట్లు ఊపందుకుంటాయి. ఇంకా నెలరోజులకు పైగా వరి పంటకు సమయముంది. దీంతో ప్రస్తుతం రైతులు జీలుగు, జనుము విత్తనాలు విత్తుకునే పనిలో నిమగ్నమయ్యారు. పలు గ్రామాల్లో ఇప్పటికే సాగు చేశారు.

సబ్సిడీపై జీలుగు, జనుము విత్తనాలు

ప్రభుత్వం రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తుంది. జీలుగు, జనుము విత్తనాలను అందుబాటులో ఉంచింది. జీలుగు 30 కిలోల బ్యాగు రూ.4,275 ఉండగా, సబ్సిడీ 50 శాతం తీసేయగా రైతులు రూ.2,137.50 చెల్లించాలి. జనుము 40 కిలోల బ్యాగు రూ.5,020 ఉండగా సబ్సిడీ 50 శాతం పోగా రైతులు రూ.2,510 చెల్లించాల్సి ఉంటుంది. జీలుగ, జనుము విత్తనాలను ఎకరాకు 10 నుంచి 12 కిలోలు చల్లుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. అయితే, ఎక్కడ చూసన రైతులు జీలుగు, జనుము విత్తనాల కోసం బారులు తీరి కనిపిస్తున్నారు. ఈసారి కావల్సినంత విత్తనాల స్టాక్ రాకపోవడంతో పచ్చిరొట్ట సాగు తగ్గే అవకాశమున్నది.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



పచ్చిరొట్ట సాగుతో భూమిలో నత్రజని స్థిరీకరింపబడి నేల సారవంతంగా మారుతుంది. దీంతో పంట దిగుబడి పెరుగుతుంది. గ్రామాల్లో రైతులకు పచ్చిరొట్ట సాగుపై అవగాహన కల్పిస్తున్నాం.

- జయంత్‌కుమార్, ఏవో, చిన్నకోడూరు

జీలుగు విత్తనాల కోసం పోటెత్తిన రైతులు

కంది, మే 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కందిలోని పీఏసీఎస్ సెంటర్ వద్ద గురువారం జీలుగు విత్తనాల పంపిణీ చేస్తున్నారని తెలిసి రైతులు పోటెత్తారు. అయితే, మండలంలో దాదాపు 1500 బస్తాలు అవసరం ఉండగా, కేవలం 167 మాత్రమే అందుబాటులో ఉన్నాయి. రైతులు మాత్రం అంతకు రెండు రెట్లు ఎక్కువగా వచ్చారు. పీఏసీఎస్ ఛైర్మన్ దొడ్ల ప్రభాకర్ రెడ్డి, సీఈవో మందాడ శ్రీధర్‌రెడ్డి పీఏసీఎస్ వద్దకు వచ్చిన రైతుకు టోకెన్లు పంపిణీ చేసి వారే దగ్గర ఉండి విత్తనాలు పంపిణీ చేశారు.



కంది పీఏసీఎస్ సెంటర్ వద్ద రైతులు

సర్కారు బడి.. నూతన ఒరవడి

ప్రైవేటుకు దీటుగా నడుస్తున్న జడ్పీహెచ్ఎస్‌లు

వసతుల్లో పర్ఫెక్ట్.. బోధనలో బెస్ట్.. క్రీడల్లో ఫస్ట్

పీఎంశ్రీకి ఎంపికైన కుకునూరుపల్లి స్కూల్

ప్రత్యేకత చాటుతున్న చిన్నకిష్టాపూర్ పాఠశాల

కుకునూరుపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి) : బోధనలో, ఫలితాల్లో, క్రీడల్లో, వసతుల కల్పనలో అన్నింటా ఉత్తమంగా నిలుస్తూ ప్రైవేటుకు దీటుగా పనిచేస్తున్నాయి ఈ సర్కారు బడులు. ఆహ్లాదకరమైన వాతావరణంలో కార్పొరేట్ పాఠశాలలతో పోటి పడి ఆదర్శంగా నిలుస్తున్నాయి. ప్రైవేటు నుంచి సర్కారు బడికి విద్యార్థులను చేర్చుకునేస్థాయికి చేరుకుని నూతన ఒరవడిని సృష్టిస్తున్నాయి. సిద్దిపేట జిల్లాలోని అవే కుకునూరుపల్లి, చిన్నకిష్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు.

ప్రైవేటు నుంచి ప్రభుత్వ బడికి...

అన్ని వసతులతో పాటు ఉపాధ్యాయ బృందం ఉత్తమ బోధనతో చదువులో రాణిస్తున్న విద్యార్థుల ప్రతిభ చూసి ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న తమ పిల్లలను తల్లిదండ్రులు కుకునూరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్పిస్తున్నారు. గత సంవత్సరం ప్రైవేటు పాఠశాల నుంచి దాదాపు 40 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో అడ్మిషన్‌లు తీసుకున్నారు. గత సంవత్సరం జిల్లా స్థాయి క్రీడా పోటీలకు, ఈ ఏడాది మండల స్థాయి పోటీలకు కుకునూరుపల్లి జడ్పీహెచ్ఎస్ ఆతిథ్యం ఇచ్చింది. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాఠశాలలో వసతులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. నాలుగు సంవత్సరాలుగా పదో తరగతిలో 10 జీపీఏ సాధిస్తూ పలువురు విద్యార్థులు ట్రిబుల్ ఐటీకీ ఎంపికయ్యారు. పదో తరగతి ఫలితాల్లోనే కాదు ఈ పాఠశాల విద్యార్థులు టేబుల్ టెన్నిస్, బాక్సింగ్ వంటి క్రీడల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కుకునూరుపల్లి జడ్పీహెచ్ఎస్ పీఎంశ్రీ పథకానికి ఎంపిక కావడం విశేషం. దీంతో కేంద్ర ప్రభుత్వ నిధులతో ఈ పాఠశాల మరింత అభివృద్ధికి బాటలు పడ్డాయి. కుకునూరుపల్లి మాజీ సర్పంచ్ పొల్కంపల్లి నరేందర్ సహకారంతో పాఠశాలను ఉత్తమంగా తీర్చిదిద్దారు. ఇప్పటివరకు దాదాపు రూ.40 లక్షల వరకు సహాయసహకారాలను అందజేశారు.



కుకునూరుపల్లి జడ్పీహెచ్ఎస్

చిన్నకిష్టాపూర్ చిచ్చరపిడుగులు

కుకునూరుపల్లి జడ్పీహెచ్ఎస్‌కు దీటుగా మండలంలోని చిన్నకిష్టాపూర్ పాఠశాల విద్యార్థులు రాణిస్తున్నారు. అటు చదువులో ఇటు క్రీడల్లో వారితో సమానంగా నిలుస్తున్నారు. ఈ సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో ఈ పాఠశాల 527 మార్కులతో ప్రభుత్వ పాఠశాల విభాగంలో మొదటి స్థానంలో నిలిచారు. మరో నలుగురు విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించారు. పదో తరగతిలో 37 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 36 మంది ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలతో కూడిన కరపత్రాన్ని ముద్రింపజేసి ప్రచారాన్ని సైతం నిర్వహిస్తున్నారు. పాఠశాలలో క్రీడా సామగ్రి, పాఠ్యపుస్తకాలు, సీసీ కెమెరాలతో పాటు అన్ని వసతులు ఉండడంతో ఈ పాఠశాలలోనూ తల్లిదండ్రులు విద్యార్థులను చేర్పేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.



చిన్నకిష్టాపూర్ స్కూల్ ప్రచార కరపత్రం

'రోడ్డు మూసేయొద్దు.. బ్రిడ్జి నిర్మించాలి'

- రామాయంపేట బైపాస్‌లో బైఠాయించిన స్థానికులు
- రోడ్డు మూసివేత పనుల అడ్డగింత

రామాయంపేట, మే 29 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేట బైపాస్ జంక్షన్ మలుపులో రోడ్డు మూసివేసే పనులను స్థానికులు అడ్డుకున్నారు. తరచూ ప్రమాదాల నేపథ్యంలో నేషనల్ హైవే అథారిటీ గురువారం తాత్కాలిక పనులకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న గోల్పర్తివాసులు అధికారులను నిలదీశారు. పనులు అడ్డుకుని ఇందుకోసం తెచ్చిన మెటీరియల్‌ను అవతల పడవేశారు. అంతేకాకుండా 'రోడ్డును మూసేయొద్దని.. మాకు బ్రిడ్జి నిర్మాణమే కావాలి' అంటూ రహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు. ఇప్పటికి రెండుసార్లు అడ్డుకుని అధికారులను నిలదీయడంతో వారు వెనుదిరుగక తప్పలేదు.


మెటీరియల్‌ను తీసేస్తున్న స్థానికులు


రామాయంపేట బైపాస్‌లో బైఠాయించిన గోల్పర్తివాసులు


ఒడిస్సీ శాస్త్రీయ నృత్యాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

సంప్రదాయ కళా వైభవం

ఐఐటీహెచ్‌లో మైమరపింపజేసిన సంగీత కచేరీ, నృత్య ప్రదర్శనలు

కంది, మే 29 (ఆంధ్రజ్యోతి) : ఐఐటీహెచ్ సంప్రదాయ కళావైభవాన్ని చాటుతోంది. కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో నాలుగో రోజైన గురువారం స్పిక్ మైకే అంతర్జాతీయ వేడుకలో సంగీత కచేరీలు, జానపద నృత్యాలు అందరిని అలరించాయి. దేశ, విదేశాల నుంచి వచ్చిన విద్యార్థులు, కళాకారులు, కళాభిమానులతో ఐఐటీహెచ్ ప్రాంగణం సందడిగా మారింది. గురువారం ఉదయం భహర, నాద్ యోగా, ధ్యానం శ్రమదాన్, ఇంటెన్సివ్ వర్క్‌షాప్‌లు జరిగాయి. మధ్యాహ్నం పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత పండిట్ హరిప్రసాద్ మధురమైన వేణుగాణ ప్రదర్శన అందరిని మైమరపింపచేసింది. మధ్యప్రదేశ్‌కు చెందిన కబీర్ గయాన్ కళాకారుడు ప్రహ్లాద్ సింగ్ టిపానియా, కబీర్ ద్విపద ప్రదర్శనలు, ఆధ్యాత్మిక ఐక్యతకు లోతైన ఆలోచనను మేల్కొల్పాయి. మాల్వా జానపద సంప్రదాయంలో పాతుకుపోయిన టిపానియా సంగీతం, సామాజిక సామరస్యంపై కబీర్ బోధనల కట్టిపడేశాయి. డాక్టర్ జయతీర్థ్ మేవుడి హిందుస్థానీ వోకల్ సంగీతంతో అలరించారు. ఖుముక్చమ్ రొమేంద్రో సింగ్ పంగ్ చోలోమ్, దాతుక్ రాంలీ ఇబ్రహీం ఒడిస్సీ, విదుషి ఎ.కన్యాకుమారి కర్ణాటక వయోలిన్, విదుషి అశ్విని భిడే దేశ్‌అభిషేక్ రఘురామ్ కర్ణాటక గాన కచేరీ అబ్బురపరిచింది. పాండే హిందుస్థానీ గాత్రం కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ శాస్త్రీయ కచేరీలు, జానపద ప్రదర్శనలు, ఆధ్యాత్మిక పఠనాల ద్వారా ఈ సమావేశం భారతీయ వారసత్వాన్ని నిలబెడుతుందన్నారు. తరువాతి తరం హృదయాల్లో అవగాహన కలిగించడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

స్పిక్ మైకే సేవలు అమోఘం

1977లో ఖరగ్‌పూర్‌లో స్థాపించిన స్పిక్ మైకే (సొసైటీ ఫర్ ది ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ అండ్ కల్చర్ అమాంగ్స్ యూత్) దేశమంతటా సంస్కృతీసాంప్రదాయాన్ని ఏకం చేసిందని ప్రముఖ సంగీత విద్వాంసులు, సాహితీవేత్తలు, కవులు, కళాకారులు ప్రసంసించారు. స్పిక్ మైకే అనేది ఏళ్ల లాభాపేక్షలేని, స్వచ్ఛంద సేవకుల నేతృత్వంలోని నడుస్తున్న ఒక ఉద్యమమని వారు అభివర్ణించారు. ఇది యువతలో భారతీయ శాస్త్రీయ సంగీతం, నృత్యం, సంస్కృతిని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు.

ఈ ఫేస్ మాస్క్‌లు ఎంతో ప్రత్యేకం

అస్సాంలోని మజులి జిల్లాకు చెందిన సంప్రదాయ ఫేస్‌మాస్క్ తయారీ కళాకారుడు, పద్మశ్రీ గ్రహీత, డాక్టర్ హేమచంద్ర గోస్వామి ఐఐటీహెచ్ విద్యార్థులకు మాస్క్‌లు తయారీలో శిక్షణ అందించారు. ఆయన చేతితో తయారు చేసిన మాస్క్‌లు 15-16వ శతాబ్దపు సాధువు శ్రీమంత శంకరదేవ ప్రవేశపెట్టిన నవ-వైష్ణవ సంప్రదాయంలో పాతుకుపోయిన భక్తి నాటక ప్రదర్శనలను సూచిస్తాయి. దేవుళ్లు, దేవతలు, రాక్షసులు, జంతువులు, పక్షుల మాస్క్‌లు ఉంటాయి. వీటిలో రావణుడు, గరుడ, నరసింహ, హనుమంతుడు, వరాహ, శూర్పణఖ వంటి పాత్రలు ఉన్నాయి. ఈ మాస్క్‌లకు వెదురు, బంకమట్టి, పేడ, వస్త్రం, పత్తి, కలప, నదీ ప్రాంతాల నుంచి లభించే ఇతర పదార్థాలతో తయారు చేస్తారు.




మణిపూర్ ప్రాచీన కళ పంగ్‌చోలం నృత్యాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు, పేపర్, క్లాత్‌తో ఫేస్ మాస్క్‌లు తయారు చేయించిన హేమచంద్రగోస్వామి

బీజేపీ జెండాను ఎగురవేయడమే లక్ష్యం

● పార్టీ పట్టణాధ్యక్షుడు మనోహర్‌యాదవ్

గజ్వేల్, మే 29 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీపై బీజేపీ జెండాను ఎగురవేయడమే లక్ష్యమని బీజేపీ పట్టణాధ్యక్షుడు మనోహర్‌యాదవ్ అన్నారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, సిద్దిపేట జిల్లా జిల్లా బీజేపీ అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ ఆదేశాల మేరకు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బీజేపీ కమిటీ నియమించినట్లు ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా కట్టుబడి పనిచేయాలని, నియమ, నిబంధనలు పాటించాలని కార్యకర్తలకు సూచించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీపై బీజేపీ జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

విజిబుల్ పోలీసింగ్‌పై దృష్టి సారించాలి



తొగుట పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న గజ్వేల్ ఏసీపీ నర్సింహులు

తొగుట, మే 29(ఆంధ్రజ్యోతి): అంకితభావంతో విధులు నిర్వహించడంతో పాటు విజిబుల్ పోలీసింగ్‌పై దృష్టి సారించాలని పోలీస్ సిబ్బందికి గజ్వేల్ ఏసీపీ నర్సింహులు సూచించారు. గురువారం తొగుట పోలీస్ స్టేషన్‌ను సందర్శించి ఆయన మాట్లాడారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాది దారులతో మర్యాదగా మాట్లాడి వారి సమస్యను పరిష్కరించాలని తెలిపారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. సీజ్ చేసిన వాహనాలను సంబంధిత వాహన యజమానులకు సాధ్యమైనంత త్వరగా అందజేయాలని సూచించారు. వీపీఓ వ్యవస్థను మెరుగుపరచాలని వారంలో రెండు మూడు సార్లు గ్రామాలను సందర్శించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి కేసులో పారదర్శకంగా పరిశోధన కొనసాగాలని తెలిపారు. కేడీలు, డీసీలు, సస్పెక్ట్‌లు, రౌడీలపై మరింత నిఘా ఉంచాలని తెలిపారు. అధికారులు సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని తెలిపారు. ఎన్ఫోర్స్మెంట్ వర్క్ ప్రతిరోజు నిర్వహించాలన్నారు. ఇసుక, పీడీఎస్ రైస్, గంజాయి ఇతర మత్తు పదార్థాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు.

గౌడ కులస్థుల కమ్యూనిటీహాల్‌కు నిధులు మంజూరు చేయాలి

హుస్నాబాద్ టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలో గౌడ కులస్థుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం ఇవ్వడంతో పాటు నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గౌడ్ సంఘ మహిళలు కోరారు. గురువారం ఈ విషయంపై సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. హుస్నాబాద్ పట్టణంలో అన్ని కులాలకు కమ్యూనిటీ హాల్‌లు ఉన్నాయని, గౌడ కులస్థులకు మాత్రం లేదని తెలిపారు. మా కులంలోని కొంతమంది దీనిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. చిన్న చిన్న సమావేశం ఏర్పాటు చేసుకోవాలన్నా, ఏదైనా పండుగలు చేసుకోవాలన్నా కమ్యూనిటీ హాల్ లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించాలని కోరారు. ఈ సమావేశంలో గౌడ సంఘ మహిళలు, కల్లు గీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ న్నారు.

చేర్యాలలో నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు

చేర్యాల, మే 29 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండకేంద్రంలోని కిరాణాషాపులు, హోటల్స్, పాన్‌షాపుల్లో మత్తుపదార్థాల నివారణకు నార్కోటిక్ డాగ్స్‌తో గురువారం సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నిరేష్ మాట్లాడారు. యువత తాత్కాలిక ఆనందం కోసం మత్తుపదార్థాలకు బానిసలు కావొద్దన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఏం చేస్తున్నారో గమనిస్తుండాలన్నారు. పిల్లల ప్రవర్తనల్లో ఏదైనా అనుమానం ఉంటే సమాచారం అందిస్తే కౌన్సిలింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. గంజాయి. ఇతర మత్తుపదార్థాలు ఎవరైనా కలిగి ఉంటే డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు.

అక్రమ మట్టి టిప్పర్‌ల పట్టివేత

ములుగు, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలం నుండి అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌లను టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం రాత్రి పట్టుకున్నారు. ములుగు మండలం సింగన్నగూడ గ్రామంలో ప్రభుత్వ స్థలంలో కొందరు వ్యక్తులు రాత్రి వేళ అక్రమంగా వాహనాల్లో మట్టిని తరలిస్తున్నట్లు సమాచారాన్ని అందుకున్న ట్రాన్స్‌ఫోర్స్ అధికారులు మరియు ములుగు పోలీసులు సింగన్నగూడ గ్రామంలో పట్టుకొని నాలుగు టిప్పర్లు జేసీపీ, కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

యాదవ సంఘ భవనం ప్రారంభం

చేర్యాల, మే 29 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలంలోని ఆకునూర్‌లో యాదవ సంఘం భవనాన్ని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎంపీ చామలతో కలిసి మాట్లాడారు. గొల్లకుర్మల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కోరుతూ గురువారం సీపీఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎంపీకి వినతి పత్రాన్ని అందించారు.

గజ్వేల్‌లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం

గజ్వేల్, మే 29 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో 125 మైక్రాన్ల కన్నా తక్కువ మందం గల ప్లాస్టిక్ కవర్లు నిషేధించినట్లు మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య పేర్కొన్నారు. తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆదేశాల మేరకు మునిసిపాలిటీ పరిధిలోని వ్యాపార నిర్వాహకులు, ఫంక్షన్‌హాల్స్, బ్యాంకేట్ హాల్స్ యజమానులు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను రవాణా చేసినా చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ఇవ్వాలి

కొండపాక,మే 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు నిరుపేదలకు ఇస్తానన్న ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులను రాజకీయాలకు అతీతంగా అర్హులైన నిరుపేదలకు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు వినతి

కుకునూరుపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): కుకునూరుపల్లి మండల కేంద్రంలో వివిధ కార్యాలయాలు ఏర్పాటు చేసి అధికారులను నియమించాలని కుకునూరుపల్లి బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో డీఆర్డీఏ జయదేవ్ ఆర్యకి వినతిపత్రం అందజేశారు.



అక్కన్నపేట మండలం జనగామ, రేగొండ గ్రామాల్లో రహదారుల పక్కన నరికివేసిన చెట్లు

హరితహారానికి ఆపదొచ్చింది

- విచ్చలవిడిగా చెట్ల నరికివేత
- విద్యుత్ తీగల అడ్డొస్తున్నాయన్న సాకుతో మొదళ్ల వరకు నరుకుతున్న వైనం
- పట్టించుకోని సంబంధిత అధికారులు

అక్కన్నపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): పచ్చదనాన్ని పెంపొందించేందుకు గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతి యేడు వానాకాలంలో ప్రజలందరినీ భాగస్వాములను చేస్తూ ప్రభుత్వ, ప్రైవేటు ఖాళీ స్థలాలు, ఇళ్లు, పొలాలు, రోడ్లకు ఇరువైపుల, చెరువుల గట్లపై ప్రతిష్ఠాత్మకంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు చేపట్టారు. అవి పెరిగి పెద్దవి కాగానే విద్యుత్ తీగలకు అడ్డువస్తున్నాయని విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ఏపుగా పెరిగిన చెట్లను నరికేస్తున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యారు. అక్కన్నపేట మండలంలోని జనగామ, రేగొండ, అంతకపేట, చౌటపల్లి, కట్కూర్, ధర్మారం, గండిపల్లి తదితర గ్రామాల్లో ఏపుగా పెరిగిన చెట్లను విద్యుత్ అధికారులు తీగలకు అడ్డువస్తున్నాయని, రైతులు తమ పంట పొలాలపై నీడ వస్తుందని మొదళ్ల నుంచి నరికేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు..

గ్రామపంచాయతీల్లో కొన్ని ఏళ్ల నుంచి పెంచిన హరితహారం చెట్లను యథేచ్ఛగా నరికేస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. తీగలకు తగిలే కొమ్మలను తొలగించకుండా మొత్తం చెట్లను నరికేస్తుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సొంత భూముల్లో పెరిగిన చెట్లను తొలగించడానికి అనుమతుల పేరుతో ఇబ్బందులకు గురిచేసే అధికారులు, ఎంతో ప్రజాధనం వెచ్చించి హరితహారంలో భాగంగా పెంచిన చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా నరికేస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



హరితహారం చెట్లను నరికివేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. జరిమానాతోపాటు కేసులు కూడా నమోదు చేయిస్తాం. మొక్కలు, చెట్లను నరికివేయడం, తగలబెట్టడం లాంటి పనులు చేయవద్దు.

-బానోతు జయరాం, ఎంపీడీవో, అక్కన్నపేట

పాఠశాలలకు సమస్యలు లేకుండా చూడాలి

● అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్

సిద్దిపేట కలెక్టరేట్, మే 29(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగించుకొని పాఠశాలలు తిరిగి తెరుచుకునేప్పటికి తరగతి గదులను శుభ్రంగా ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ అన్నారు. గురువారం ఐడీవోసీలోని చాంబర్‌లో ప్రభుత్వ బీసీ, ఎస్సీ ఎస్టీ, మైనారిటీ, జూనియర్ కళాశాలలోని ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యూనిఫాంలను ఆలస్యం కాకుండా విద్యార్థులకు అందించేలా చూడాలని, అల్పాహారం, భోజనం ప్రభుత్వం నిర్ణయించిన నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ అందించాలని, స్వయం సహాయ సంఘాలను తీసుకునేలా ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు. పునఃప్రారంభం నాటికి ఎక్కడ విద్యుత్, ఇతర రిపేర్లు లేకుండా చూసుకోవాలని అదనంగా అవసరమైన వాటి నివేదిక అందించాలన్నారు. అన్ని ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాలయాల్లో హార్వెస్టింగ్ పిట్, బోర్ వెల్ రీఛార్జ్, రెయిన్ వాటర్ రీఛార్జ్ ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్య, డీబీసీడీవో నాగరాజమ్మ, డీఈవో శ్రీనివాస్ రెడ్డి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యాలయాల సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కామన్ స్కూల్ విధానం తీసుకురావాలి



టీపీటీఎఫ్ పతాకావిష్కరణ చేస్తున్న నాయకులు

దుబ్బాక/సిద్దిపేట కల్చరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): విద్యారంగాన్ని ఒకే గొడుగు కిందకు తీసుకరావాలని, విద్యా సంస్థలన్నింటిని ప్రభుత్వమే నిర్వహించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి. తిరుపతి రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ 11వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఉపాధ్యాయ భవన్‌లో జిల్లా శాఖ ఆధ్వర్యంలో టిపిటిఎఫ్ పతాకాన్ని ఆవిష్కణ చేసిన అనంతరం మాట్లాడారు. ఉన్నోని పిల్లలైనా, లేనోడి పిల్లలైన ఒకే పాఠశాలలో చదివే విధంగా కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి టీపీటీ ఎఫ్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కామన్‌స్కూల్ విధానాన్ని అమలుచేయాలని టీపీటీఎఫ్ దుబ్బాక జోన్‌కన్వీనర్ అమ్మన నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం దుబ్బాక మండల వనరుల కేంద్రం వద్ద టీపీటీఎఫ్ జెండాను ఎగరవేశారు.

త్వరలోనే ఇచ్చిన హామీలు అమలు

ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



సీఎంఆర్ఎఫ్ ఫండ్ చెక్కులు అందిస్తున్న ఎంపీ

చేర్యాల, మే 29 (ఆంధ్రజ్యోతి) : ఇది ప్రజా ప్రభుత్వమని త్వరలోని ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తుందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం చేర్యాలలోని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో కొమ్మూరితో కలిసి చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలకు సంబంధించిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. అనంతరం ఎంపీ మాట్లాడారు. పేద ప్రజల కోసం కోట్లాది రూపాయల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించినట్లు తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ బాధిత కుటుంబాలకు ఎంతో ఆసరాగా నిలుస్తుందన్నారు. మాది ప్రజా ప్రభుత్వమని, నిరంతరం పేదల పక్షాన పని చేస్తుందన్నారు. త్వరలోనే ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరస్తుందని తెలిపారు.

రూ.4 లక్షలు విరాళం ప్రకటించిన స్వచ్ఛ కర్మ ఫౌండేషన్

హుస్నాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు సెట్విన్ ద్వారా శిక్షణ ఇవ్వడానికి స్వచ్ఛ కర్మ ఫౌండేషన్ రూ. 4 లక్షలు విరాళం ప్రకటించినట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. 2020 సంవత్సరంలో స్థాపించిన స్వచ్ఛకర్మ ఫౌండేషన్ పేదలకు మద్దతు ఇచ్చే లక్ష్యంతో పని చేస్తుందని, 2025- 26 ఆర్థిక సంవత్సరానికి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు పలు రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలను ప్రోత్సహించడానికి ఈ విరాళం ప్రకటించిందన్నారు. సెట్విన్ ద్వారా నిరుద్యోగ యువతకు శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నారు. శిక్షణ తీసుకోవాల్సిన అభ్యర్థులు హుస్నాబాద్‌లోని సెట్విన్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

రూ.1.90 కోట్ల బీమా క్లెయిమ్



మృతుడి కుటుంబానికి చెక్కు అందజేస్తున్న టాటా ఏఐఏ అడ్వైజర్

గజ్వేల్ రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఓ వ్యక్తికి భారీ మొత్తంలో ఇన్సూరెన్స్ క్లెయిమ్ అయింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఇటీవల రోడ్డు ప్రమాదంలో కరీంనగర్ జిల్లాకు చెందిన సాయికుమార్‌గౌడ్ మృతి చెందాడు. ఆయన జనవరిలో గజ్వేల్‌కు చెందిన అడ్వైజర్ ద్వారా టాటా ఏఐఏలో వార్షిక ప్రీమియంగా రూ.1,25,127 చెల్లించి టర్మ్ పాలసీ తీసుకున్నాడు. కుటుంబ సభ్యులు సంబంధిత కంపెనీకి అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించగా మె 19న క్లెయిమ్ మొత్తం రూ.1,90,00,000 నామినీగా ఉన్న అంకంగారి ప్రసన్న ఖాతాలో జమయ్యాయి. ఈ సందర్భంగా టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కరీంనగర్ బ్రాంచ్ సీనియర్ మేనేజర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సాధారణ ప్రీమియంతో అకాల మరణంలో కటుంబానికి కోట్లలో భద్రత అందేలా టర్మ్ ఇన్స్యూరెన్స్ పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ సిబ్బంది ఆదర్శ్‌కుమార్, వీరస్వామి, చంద్రశేఖర్, శ్రీకాంత్, రాయపోల్ ప్రసాద్, దూలం రమేష్, గూడెల్లి రాజు, అంజనేయులు, విద్యాసాగర్, వెన్నల, స్వామి పాల్గొన్నారు.

ఎన్నో ఏళ్ల కల సాకారం..



గంగమ్మకు పూజలు చేస్తున్న పూజల హరికృష్ణ

సిద్దిపేట రూరల్,మే 29(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న బండల కుంట ప్రాంత రైతుల కళ సాకారమైందని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. గురువారం సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ గ్రామంలో పెద్ద చెరువు నుంచి బండ కుంటకు నీళ్ల నింపడం కుంటను పరిశీలించి గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పూజలహరికృష్ణ మాట్లాడుతూ బండ కుంటలో సాగుకు నీళ్ల నింపడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కుంటలో నీళ్ల నింపడం వల్ల ప్రతి రైతు రెండు పంటలు పండించుకుని ఆర్థికంగా ఎదుగాలని కోరారు. అనంతరం గ్రామంలోని పల్లెగామ దేవతల ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

సంగీత, నృత్య కళా క్షేత్ర 18వ వార్శికోత్సం

సిద్దిపేట కల్చరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటలోని శ్రీ అన్నమాచార్య సంగీత, నృత్య కళా క్షేత్రం 18వ వార్శికోత్సవానికి సిద్ధమైంది. వ్యవస్థాపక అధ్యక్షుడు అన్నమయ్య పవన్ సారథ్యంలో రెండు రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ నెల 30న శ్రీ అన్నమాచార్య సహిత శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి లీలా కల్యాణమూర్తుల ఊరేగింపు, అన్నమయ్య 12వ తరం వారసులైన తాళ్లపాక హరినారయణ ఆచార్యులతో సంకీర్తన గానం, ప్రసంగం. 31న 108 మంది దంపతులతో 108 విశేష జలాలతో స్వామి వారికి జ్యేష్టాభిషేకం.

రైతులకు మేలు చేకూర్చేలా భూ భారతి

మద్దూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): రైతులకు మేలు చేకూర్చేలా భూ భారతిని తీసుకురావడం జరిగిందని తహసీల్దారు ఏజీ రహీం తెలిపారు. గురువారం తహసీల్దారు కార్యాలయంలో మీడియాతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. భూ భారతిలో అప్పీలు చేసుకునే వ్యవస్థతో పాటు సాదాబైనామాకు మోక్షం లభించనుందన్నారు. అలాగే, పీవోటీ కేసుల పరిష్కారంతో పాటు సక్సేషన్స్‌కు తప్పని సరిగా కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రంతో పాటు వీలునామా కాగితాల్ని పరిశీలించి 30 రోజుల్లో రిజిస్ట్రేషన్స్ పూర్తి చేస్తామన్నారు.


ఆలయానికి గంట విరాళం



గంటను ప్రదానం చేస్తున్న దాతలు

మర్కుక్, మే 29 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండలం పురాతన దేవాలయం వరద స్వామి దేవాలయ పునః నిర్మాణం చేసి స్వామివారికి తిరుపతిగుడిలో మాదిరిగా అన్ని వాయిద్యాలు కలిగిన గంటను అమెరికాలో ఉంటున్న సరూర్‌నగర్ వాస్తవ్యులు తొడుపునూరి మంజుల విజయసారధిలు దేవాలయ కమిటీకి అందించారు.

సేంద్రియ పద్ధతులపై అవగాహన



మాట్లాడుతున్న ఏడీఏ బాబునాయక్

గజ్వేల్ రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): సమగ్ర సస్యరక్షణ పద్ధతుల ద్వారా రైతులకు కలిగే లాభాలు, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులపైన గజ్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు బాబునాయక్ రైతులకు అవగాహన కల్పించారు. గురువారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా వివిధ ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు గజ్వేల్ మండలంలోని అహ్మదీపూర్, శేరిపల్లి, దారత్‌పల్లిలో పర్యటించి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు ఎఫ్‌పీఓ స్థాపన వల్ల కలిగే లాభాలు, కిసాన్ యాప్ ద్వారా వాతావరణ సూచనలను పొందవచ్చని, వరి, పత్తి మొక్కజొన్నలు వాడే వివిధ యంత్రాలను అలాగే డ్రోన్‌ల ఉపయోగం వలన కలిగే లాభాల పైన రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ పథకాలు గురించి వివరించడం జరిగింది.

ప్రభుత్వ బడుల బలోపేతానికి సంకల్పిద్దాం

హుస్నాబాద్ /గజ్వేల్, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి టీపీటీఎఫ్ కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను జోన్ కన్వీనర్ శ్రీనివాస్ ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసుకోవడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, యువత, ప్రభుత్వ యంత్రాంగం అంతా సంకల్పించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ వలీ అహ్మద్ కోరారు.

న్యూస్ బాక్స్

కనకదుర్గమ్మ ఆలయానికి రూ.లక్ష విరాళం

మర్కుక్, మే 29 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండల పరిధిలోని పాములపర్తి గ్రామంలో ముదిరాజుల సంఘం ఆధ్వర్యంలో కనకదుర్గ ఆలయాన్ని నూతనంగా నిర్మించారు. ఆలయ అభివృద్ధికి ప్రముఖ వ్యాపారవేత్త ఇనకొండ చంద్రారెడ్డి, వారి కూతురు ప్రణీతరెడ్డిలు గురువారం ఆలయ నిర్వహకులకు రూ. లక్ష విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మ్యాకల కనకయ్య ముదిరాజ్, మహేష్, సుధాకర్, రాజు, లక్ష్మణ్ తదితరులు న్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 10 మందికి జరిమానా

● ఒకరికి ఐదు రోజుల జైలు శిక్ష

సిద్దిపేట క్రైం, మే 29 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తన సిబ్బందితో గత కొన్ని రోజుల క్రితం నుండి సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తాలలో రాజీవ్ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. వన్ టౌన్ సిఐ వాసు దేవ రావు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీ నిర్వహించారు.ఈ క్రమంలో 10 మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకొన్నారు. వారిని గురువారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు, న్యాయమూర్తి ముందు హాజరుపరచగా విచారణ చేసి 10 మందికి రూ.20,500 జరిమాన, ఒక వ్యక్తికి ఐదు రోజులు జైలు శిక్ష విధించారు.

జూన్ 3 నుంచి రెవెన్యూ గ్రామ సభలు

మద్దూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండలంలో జూన్ 3 నుంచి 9 వరకు రెవెన్యూ గ్రామ సభలు జరుగుతాయని తహసీల్దారు తెలిపారు. రెండు టీంలుగా ఏర్పడి గ్రామ సభల్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ గ్రామసభల్లో రైతులు భూ సమస్యలపై దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 3న సలాఖ్‌పూర్, రేబర్తి 4న ధర్మారం, మర్మాముల, 5న మద్దూరు, లద్నూరు 6న గాగిళ్లాపూర్, నర్సాయపల్లి 9న వల్లంపట్ల వంగపల్లి గ్రామాల్లో గ్రామసభలు జరుగుతాయని తెలిపారు. గ్రామ సభల్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు

క్రీడా స్టేడియాలను అభివృద్ధి చేయాలి

హుస్నాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని క్రీడా స్టేడియాలను అభివృద్ధి చేయాలని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి అధికారులను కోరారు. పట్టణంలో క్రీడాకారుల కోసం కోట్ల రూపాయలువెచ్చించి నిర్మించిన మినీ స్టేడియానికి పర్యవేక్షణ లేకపోవడంతో నిరూపయోగంగా ఉంటుందన్నారు. ఇండోర్ స్టేడియం నిర్మించిన కొద్ది రోజులకే అక్కరకు రాకుండా పోయిందన్నారు. దీని కిటికిల గ్లాస్‌లు పగిలిపోయాయని, షటిల్ కోర్టు మ్యాట్ అక్కరకు రాకుండా పోయిందన్నారు. . ఇప్పటికైనా మినీ స్టేడియాన్ని ఆటలకు అనువుగా తీర్చిదిద్దాలని కోరారు.

కలెక్టర్‌ని కలిసిన గజ్వేల్ ఏసీపీ

గజ్వేల్, మే 29 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనూచౌదరిని గజ్వేల్ ఏసీపీ కె. నర్సింహులు మర్యాదపూర్వకంగా కలిశారు. సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో గురువారం కలిసిన ఆయన కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు.

నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాల విక్రయం



విలేకరులతో మాట్లాడుతున్న మహేందర్

గజ్వేల్, మే 29 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్నారని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేవులపల్లి మహేందర్ అన్నారు. గజ్వేల్ పట్టణంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గజ్వేల్ పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, టై, బెల్టులు, అమ్ముతున్నారని, పుస్తకాల విక్రయం ఆపకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. స్టేషనరీ దుకాణాలను పాఠశాలల్లోనే ఏర్పాటు చేసి, సరస్వతీ నిలయాలను వ్యాపార కేంద్రాలుగా మారుస్తున్నారని మండిపడ్డారు.

మృతుడి కుటుంబానికి పల్లా పరామర్శ

చేర్యాల, మే 29 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణ కేంద్రంలో గుండెపోటుతో మృతిచెందిన బీఆర్ఎస్ కార్యకర్త, మాజీ వార్డు సభ్యుడు బొడ్డు వీరేషం మృతి చెందారు . జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కుటుంబాన్ని గురువారం సందర్శించి పార్థీవ దేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి ధైర్యం చెప్పారు.

మాజీ ఎంపీటీసీ కన్నుమూత

చేర్యాల, మే 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వీరన్నపేట గ్రామ మాజీ ఎంపీటీసీ మొగుళ్ల విష్ణువర్ధన్‌రెడ్డి గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. గ్రామానికి మొదటి ఎంపీటీసీగా ప్రజలతో మమేకమై గ్రామాభివృద్ధికి సేవలందించారు. ఈ విషయం తెలుసుకున్న టీపీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ల రాజిరెడ్డి కుటుంబానికి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.